క్లుప్తంగా

ఆలయ స్థలం కబ్జా కాకుండా చూస్తా


వేణుగోపాల్ యాదవ్ (ఫైల్)

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట కొండపై ఉన్న స్థలం కబ్జాలు కాకుండా చూస్తానని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ వేణుగోపాల్ యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవలే చైర్మన్ బాధ్యతలు చేపట్టిన వేణుగోపాల్ యాదవ్ మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాలుగా కమిటీ లేకపోవడం స్థలాల కబ్జాలు జరుగుతున్నాయి. ఈ విషయమై పై అధికారుల దృష్టికి తీసుకెళ్లుతానని ఆయన అన్నారు. అలాగే గుడి అభివృద్ధి విషయమై దశలవారీగా పూర్తి చేస్తానని తెలిపారు. అలాగే భక్తులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తానని అన్నారు. కొండపై అసాంఘీక కార్యాకలాపాలు జరుగుతున్నాయన్న విషయం కూడా తన దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై కూడా పోలీసులకు ఫిర్యాదు చేసి తగు చర్యలు తీసుకునేలా ప్రయత్నిస్తానని వేణుగోపాల్ యాదవ్ తెలిపారు.

అల్పాహారం పంపిణీకి 1000 రోజులు


సూరారం మల్లారెడ్డి ఆస్పత్రి వద్ద టిఫిన్‌లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

సుభాష్‌నగర్: లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ ఆధ్వర్యంలో ప్రతిరోజు ఉదయం సూరారంలోని మల్లారెడ్డి ఆసుపత్రి వద్ద రోగులు, వారి బంధువులకు ఉచితంగా టిఫిన్ పంపిణీ చేస్తున్నారు. మంగళవారం వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు హాజరై వారి చేతుల మీదుగా అల్పాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ నార్త్ వ్యవస్థాపకుడు విజయ్ కుమార్ శెట్టి మాట్లాడారు. ప్రస్తుతం 300 ఫ్యామిలీలతో సంవత్సరం పాటు నిరంతరంగా ప్రతిరోజు రోగులకు, బాటసారులకు సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రి వద్ద ఉదయం 8.30 గంటలకు టిఫిన్ ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. అదే విధంగా షాపూర్ నగర్ లోని హనుమాన్ టెంపుల్ వద్ద వారంలో రెండుసార్లు మధ్యాహ్నం భోజనం, వేసవికాలంలో మజ్జిగ పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాలను ముందుండి నడిపిస్తున్న రవీందర్ ముదిరాజును సన్మానించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ గవర్నర్ మల్లారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్ ముదిరాజ్, సల్వ సాయిరాం రాజ్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై మంత్రి కేటీఆర్‌కు ధన్యవాదాలు

జగద్గిరిగుట్ట: డివిజన్ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసిన మంత్రి కేటీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలని కార్పొరేటర్ జగన్ ఓ ప్రకటనలో తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ పనులకు గాను 3 కోట్ల 83 లక్షలు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. ఈ నిధులు మంజూరు కావడానికి ఎంతో కృషి చేసిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు కూడా డివిజన్ ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. రూ.98 లక్షలతో రింగ్ బస్తీలో, రూ.48 లక్షలతో రాజీవ్ గృహకల్పలో, రూ.25 లక్షలతో షిరిడీ హిల్స్‌లో, రూ.49 లక్షలతో అంజయ్యనగర్‌లో, రూ.63.70 లక్షలతో జగద్గిరినగర్‌లలో సీసీ రోడ్లు నిర్మాణానికి, అలాగే రూ.21.50 లక్షలతో షిరిడీ హిల్స్-బీ, రూ.31లక్షలతో షిరిడీ హిల్స్‌లో-ఏ, రూ.47 లక్షలతో సంజయ్‌పూరి కలనీలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు నిధులు మంజూరయ్యాయని కార్పొరేటర్ జగన్ తెలిపారు.

డీసీఎం ఢీకొట్టడంతో కార్మికుడి మృతి


సురేష్ (ఫైల్)

నిజాంపేట్: రోడ్డు పనులు చేపడుతున్న కార్మికుడిని డీసీఎం వ్యాన్ ఢీకొట్టడంతో మృతి చెందిన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని గుడిమల్కాపూర్‌లో నివాసముంటున్న సురేష్(22) ప్రగతినగర్ కమాస్ సమీపంలోని సింహపూరికాలనీ ఎంట్రన్స్‌లో రోడ్డు పనుల్లో కార్మికుడిగా పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం రోడ్డు పనులు చేస్తుండగా బాచుపల్లి నుండి ప్రగతినగర్ వైపు వేగంగా వచ్చిన పాల వ్యాన్ (టీఎస్ 12యూడీ4641) సురేష్‌ను ఢీకొట్టింది. తలకు తీవ్రగాయం కావడంతో అతన్ని వెంటనే సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి బంధువు గోపయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గణపతి నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. 'తండ్రివలే ఆదరించి.. తోడు నీడ అందించయ్యా' అని వేడుకుంటూ భక్తులు గణనాథుడికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. మంగళవారం పలు మండపాల వద్ద వినాయక లడ్డూ వేలం పాట నిర్వహించారు. భక్తులు పోటీ పడి లడ్డూలను కైవసం చేసుకున్నారు. మతాలకు అతీతంగా కుత్బుల్లాపూర్ గ్రామంలో జరిగిన వేలం పాటలో మహమ్మద్ రషీద్ రూ.70 వేలకు లడ్డూను సొంతం చేసుకున్నారు. అదే విధంగా వివిధ మండపాల వద్ద జరిగిన పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం గణనాథులను డప్పు చప్పుళ్ల మధ్య చెరువుల్లో నిమజ్జనం చేసేందుకు తరలించారు. – కుత్బుల్లాపూర్


బాలయ్యనగర్‌లో గణపతి వద్ద పూజలు నిర్వహిస్తున్న మహిళలు

దండాలయ్యా.. ఉండ్రాలయ్యా..

దయుంచయ్యా దేవా..

భక్తిశ్రద్ధలతో వినాయక చవిత ఉత్సవాలు



ఉడ్స్ ఎన్‌క్లేవ్ కాలనీలో వినాయకుడిని దర్శించుకుంటున్న భక్తులు, యువతుల నృత్య ప్రదర్శన


షాపూర్‌నగర్ ఉషోదయ టవర్స్ వద్ద గణేశ్ పూజల్లో పాల్గొన్న అధ్యక్షుడు కూన రవీందర్‌గౌడ్


చింతల్‌లోని పద్మావతి ఫేజ్-2 రెసిడెన్స్‌లోని గణేశ్ మండపంలో భక్తులు


గణపతి పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్


వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో బాలకృష్ణ గౌడ్, అనురాధ దంపతుల పూజలు


కుత్బుల్లాపూర్ గ్రామంలో ఉత్సవాల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ-ఏ బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్


భౌరంపేట్ ప్రణీత్ ప్రణవ్ బ్లూమ్స్‌లో రూ.2.5 లక్షలకు లడ్డూను కైవసం చేసుకున్న కె.మధుసూదన్‌రెడ్డి


కుత్బుల్లాపూర్ గ్రామంలో రూ.70 వేలకు లడ్డూను దక్కించుకున్న మహమ్మద్ రషీద్‌కు అందజేస్తున్న విశాల్‌గౌడ్

ఆదరించండి అండగా ఉంటా

- ఎమ్మెల్యే వివేకానంద్..
- రూ. 5.76 కోట్లతో శంకుస్థాపనలు
- జీడిమెట్ల డివిజన్‌లో 15వ రోజు ప్రగతియాత్ర


ఎమ్మెల్యే వివేకానంద్‌కు పూలకుండి అందజేస్తున్న కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు

కుత్బుల్లాపూర్: వర్షాకాలం సమయంలో ఇక్కడికి వచ్చాను... పరిస్థితిని చూసి నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేస్తున్నా.. రోడ్డు పూర్తయిన తర్వాత వచ్చి ఓట్లు అడుగుతా... తప్పకుండా మరోసారి అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే వివేకానంద సంక్షేమ సంఘాల ప్రతినిధులను కోరారు. జీడిమెట్ల డివిజన్ పరిధిలో మంగళవారం 115వ రోజు ప్రగతి యాత్రలో భాగంగా ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్య అతిథిగా వైష్ణవి ఎనక్లేవ్‌లో పర్యటించారు.

◆ ఈ సందర్భంగా రూ.64లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, ఎన్‌సీఎల్‌కాలనీలో రూ.91 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, సప్తగిరి ఎన్‌క్లేవ్‌లో రూ.32లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు, అంగడిపేట్‌లో రూ.58లక్షలతో, జీడిమెట్ల గ్రామం వద్ద రూ.78 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, రాఘవేంద్ర కాలనీలో రూ. 42.40 లక్షలతో, ఎం.ఎన్.రెడ్డి నగర్ ఫేస్-1, 2లలో రూ.34 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, ప్రసూన నగర్‌లో రూ. 37 లక్షలు, భూమారెడ్డి కాలనీలో రూ. 39 లక్షలు, వినాయక్ నగర్ రూ.1.06 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు పాదయాత్ర చేస్తూ శంకుస్థాపన చేశారు.

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ల సహకారంతో జీడిమెట్ల డివిజన్ల పరిధిలోని పలు కానీలలో రూ. 5 కోట్ల 76 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించుకున్నామన్నారు. గడిచిన 9 ఏళ్లలో కోట్లాది రూపాయలు వెచ్చించి నియోజకవర్గ పరిధిలో అనేక అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. ప్రజా సౌకర్యమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, భాగయ్య, వైష్ణవి ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, మాజీ కోశాధికారి రాకేష్ కుమార్, శివకుమార్ పాండే, నాగరాజు, ప్రధాన కార్యదర్శి నందన్‌గౌడ్, అవినాష్, నరసింహారెడ్డి, సందీప్ పలువురు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన..

ఎమ్మెల్యే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన తదనంతరం జీడిమెట్ల డివిజన్ కార్పొరేటర్ తారా చంద్రారెడ్డి అవే పనులకు శంకుస్థాపనలు చేయడం గమనార్హం. ఆమె వెంట బీజేపీ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి తదితరులు ఉన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన కార్పొరేటర్ తారాచంద్రారెడ్డి

బీఆర్‌ఎస్‌కు మాజీ జడ్పీ వైస్‌చైర్మన్ రాజీనామా

దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి మరో ఝలక్ తగిలింది. ఇప్పటికే కొందరు ఆ పార్టీని వీడగా తాజాగా మరికొందరు బీఆర్ఎస్ నేతలు కారు దిగి హస్తం గూటికి చేరుతున్నారు. బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు వెంట నడిచేందుకు సిద్ధమయ్యారు. నియోజకవర్గంలోని ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలతో సత్సంబంధాలు కలిగి ఉన్న మైనంపల్లికి మద్దతుగా పలువురు ముందుకు వస్తున్నారు.

రాజీనామా చేసిన పలువురు బీఆర్ఎస్ నేతలు...

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ వైస్‌చైర్మన్ బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి, డి.పోచంపల్లి మాజీ సర్పంచ్ తలారి యాదగిరి, కొంపల్లి మాజీ సర్పంచ్ జెమ్మి నాగమణి, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ జెమ్మి దేవేందర్, కొంపల్లి మాజీ వార్డు సభ్యుడు సన్న శ్రీనివాస్‌యాదవ్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. కొంత కాలంగా వీరంతా బాహాటంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. ఈనెల 27వ తేదీన ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో మైనంపల్లి హన్మంతరావుతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు.

చాకలి ఐలమ్మకు నివాళి

వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్ప సముదాయంలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్యే కేపీ వివేకనంద్ ఆవిష్కరించారు. అలాగే జగద్గిరిగుట్ట చెక్‌పోస్ట్ సమీపంలో ఉన్న విగ్రహానికి నివాళులర్పించారు. ఐఎన్‌టీయూసీ తెలంగాణ ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య పాల్గొని పండ్లు పంపిణీ చేశారు. అదే విధంగా జగద్గిరిగుట్ట చెక్‌పోస్ట్ సమీపంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్ నివాళి అర్పించారు. – జగద్గిరిగుట్ట


రాజీవ్ గృహకల్ప సముదాయంలో ఎమ్మెల్యే కేపీ వివేకనంద్


చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కాసాని వీరేశ్‌ముదిరాజ్ తదితరులు


జగద్గిరిగుట్ట చెక్‌పోస్ట్ సమీపంలో మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

సాలకట్ల బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్సీ రాజు

కుత్బుల్లాపూర్: తిరుమల తిరుపతిలో జరుగుతున్న సాలకట్ల బ్రహ్మోత్సవాలకు మంగళవారం ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, రావుల శేషగిరి, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, గాజులరామారం డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు విజయ్ రామిరెడ్డి తదితరులు ఉన్నారు.


తిరుమలలో సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

స్థానికులకు కేటాయించిన బూత్‌లలోనే

ఓటు హక్కు కల్పించాలి

కుత్బుల్లాపూర్: ఒక బూత్‌లోని ఓటర్లను మరో బూత్‌లో చేర్చడంతో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఇబ్బందులు తలెత్తే అవకాశముందని.. స్థానికులకు వారికి కేటాయించిన బూత్‌లలోనే ఓటు హక్కు కల్పించాలని కొంపల్లి మున్సిపల్ బీజేపీ నాయకుడు శివాజీ రాజు అన్నారు. కొంపల్లి మున్సిపల్ పరిధి నోబుల్ కాలనీలోని ఢిల్లీ ఇంటర్నేషనల్ స్కూల్‌లోని 54, 57 బూత్‌లలో ఓటర్ల పేర్లు గల్లంతైన విషయమై మంగళవారం ఆయన కొంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీహరిని కలిసి ఫిర్యాదు చేశారు.

◆ ఈ సందర్భంగా శివాజీ రాజు మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు బూత్‌ల సంఖ్యను పెంచిందన్నారు. కాని నోబుల్ కాలనీలో 900 పైచీలుకు ఓటర్లు ఉన్నా 54, 57 బూత్‌లలో 114 మంది పేర్ల మాత్రమే ఉన్నాయన్నారు. మిగిలిన ఓట్లర్ల పేర్లు ఏయే బూత్‌లలో ఉన్నాయో వివరాలను సేకరించి కమిషనర్‌కు అందజేశామని తెలిపారు. నోబుల్ కాలనీ వాసులకు స్థానికంగా ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ కుత్బుల్లాపూర్ ఆర్వో దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. సమస్య పరిష్కారం కాని పక్షంలో తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సీఈఓ వికాస్ రాజ్‌కు ఫిర్యాదు చేస్తామని శివాజీ రాజు తెలిపారు.


కొంపల్లి కమిషనర్ శ్రీహరికి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకుడు శివాజీరాజు దంపతులు

పార్టీ ఆదేశిస్తే కుత్బుల్లాపూర్ నుంచి పోటీ చేస్తా

వైఎస్సార్‌టీపీ నాయకుడు సాతాల గోపాల్



కుత్బుల్లాపూర్: వైఎస్సార్‌టీపీ అధిష్టానం ఆదేశిస్తే తప్పకుండా కుత్బుల్లాపూర్‌లో పోటీ చేస్తానని నియోజకవర్గ నేత సాతాల గోపాల్ అన్నారు. నగరంలోని లోటస్ పాండ్‌లో సోమవారం జరిగిన పార్టీ అంతర్గత సమావేశంలో పార్టీ అధినేత వైఎస్ షర్మిల ఆదేశాలతో తప్పకుండా వచ్చే ఎన్నికల్లో కుత్బుల్లాపూర్‌లో వైఎస్ఆర్‌టీపీ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. అఖిల భారత వడ్డెర సంఘం రాష్ట్ర కార్మిక అధ్యక్షునిగా, బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్న గోపాల్ స్థానికంగా అందరికీ సుపరిచితునిగా ఉంటూ వస్తున్నాడు. వచ్చే నెల నుంచి పార్టీ కార్యాలయంలో టికెట్ కోసం దరఖాస్తు చేసుకునే క్రమంలో ఆయన మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తాను పోటీలో ఉంటానని స్పష్టం చేశారు.

◆ వైఎస్సార్‌టీపీ ఆవిర్భావం నుంచి కుత్బుల్లాపూర్ నియోజకవర్గం డివిజన్ కమిటీలతో పాటు ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ అధికారులకు ఫిర్యాదు చేస్తూ వచ్చారు. ఇలా అనేక ఆందోళనలో కూడా పాల్గొన్నారు. వైఎస్ షర్మిల వెంట పాదయాత్రలో పాల్గొని గుర్తింపు తెచ్చుకున్నానని తప్పకుండా అధిష్టానం ఆదేశిస్తే కుత్బుల్లాపూర్‌లో జెండా ఎగరవేస్తామని స్పష్టం చేశారు. వైఎస్సార్ సంక్షేమ పథకాలు నియోజకవర్గంలో ఎంతోమంది లబ్ధి పొందారన్నారు. పేదల గుండె చప్పుడుగా ఉన్న వైఎస్సార్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు

ఆందోళనకు దిగిన మార్కెట్ ప్రతినిధులు

కుత్బుల్లాపూర్: రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేయడంపై షాపూర్‌నగర్ మార్కెట్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం ఆందోళనకు దిగారు. షాపూర్‌నగర్ ప్రధాన చౌరస్తా వద్ద రంగా- భుజంగా థియేటర్ సమీపంలో ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకొని జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు రోడ్డుకు అడ్డంగా బారికేడ్ ఏర్పాటు చేశారు. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. అంతేకాకుండా మార్కెట్‌కు వెళ్లే వారు సైతం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనివల్ల అటు వ్యాపారాలు చేసుకునేవారు ఇబ్బందులు పడుతుండగా వాహనదారులు సైతం చుట్టూ తిరిగి రావాల్సి వచ్చేది.

◆ ఈ విషయంపై పలు పర్యాయాలు మార్కెట్ అసోసియేషన్ ప్రతినిధులు ట్రాఫిక్ పోలీసులను కలిసి విన్నవిస్తే పట్టించుకోకపోవడంతో మంగళవారం అకస్మాత్తుగా వ్యాపారస్తులు అంతా రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. దీంతో తీవ్ర ట్రాఫిక్ జామ్ కావడంతో ట్రాఫిక్ పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఇదే క్రమంలో అటువైపుగా వెళ్తున్న ఎమ్మెల్యే వివేకానంద్‌కు ఈ విషయం వివరించడంతో వెంటనే స్పందించి ఆయన రోడ్డుకు అడ్డంగా ఉన్న వాటిని తొలగించాలని మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్‌రావు, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులతో ఫోన్‌లో మాట్లాడి ఆదేశించడంతో వెంటనే తొలగించారు. దీంతో వ్యాపారస్తులు హర్షం వ్యక్తం చేశారు.